# కలహాలు

నేను పుట్టిన వేళావిశేష మేమోగాని, నాకు చిన్నప్పటినుంచీ కలహామంటేమహానందం. చిన్నప్పుడు నాతోడివాళ్లతో ఏ విషయాన్ని గురించి అయినా ఊరికే వాదిస్తూ వుండేవాణ్ణి. తర్వాతతర్వాత విద్యార్థిదశలో 'డిబేటింగ్ సొసైటీ'లో వాదన. ఒకళ్లు 'ఔ'నన్నది నేను 'కా'దనాలె; వాళ్లు 'కా' దన్నది నే 'నౌ'ననాలె—ఇది నాకు సహజస్వభావ మయింది. ఆతర్వాత మా ఆవిడతో కలహాం. 'కలహ'మన్న పదాని కెన్ని అర్థా లున్నా నా'కలహా'నికి మాత్రం 'ప్రణయకలహ' మనే అర్థం. నేనొకళ్ల జోలికి పోను. కాని మా ఆవిడతో 'కలహాం' లేకుండా ఉండలేను. నాది "ప్రేమైక జీవన"మని నాభావన. అందుచేత నా మనోగత మేమిటంటే, ఏదో వకక్షుద్రకలహాం అప్పుడప్పుడు లేకపోతే నాకు 'ప్రేమ'లోని రుచి రుచికరంగా ఉండడంలేదు. అందుచేత కారణం లేనిదే—(ప్రణయకలహానికి కారణమే లేకుంటుందా?") మా ఆవిడను కలహాంలోకి దింపేవాణ్ణి. ఇది నాకు సహజస్వభావ మయింది. ఏమి చేసినా ఆ స్వభావం మారకుండా నున్నది. క్రమేణా అది నాలో వక పెద్దజాడ్యంగా పరిణమించింది. అది నాలో జీర్ణించి ఉండి ఏవారం రోజులకో, ఏపదిరోజులకో, ముఖ్యంగా నాకు సెలవు దినాల్లో, తలయెత్తేది. ఇది నాకొక వెట్టి—కాని ఎన్నో నెంబరు వెట్టో?

'ప్రేమ' అంటే నేమో నాకు తెలియదు. కాని నా భార్యను నేను ప్రేమిస్తున్నానని మాత్రం నాకు తెలుసును. ఎట్లా? ప్రేమ తత్త్వ మెటువంటిది? ఏమో! నాకు తెలిసిన ప్రేమ తత్త్వం వేరే! నాప్రేమతత్త్వం నాది! ఒకళ్ల అభిప్రాయంతో నే నేకీభవిస్తానో లేదో, నాతో నొకళ్లు ఏకీభవిస్తారో లేదో, నా కవసరం లేదు. నాతత్త్వం నాది. స్పష్టంగా చెబుతాను:

ప్రేమ యెల్లప్పుడూ జాగ్రతావస్థలో నుండాలె. దినదినాభివృద్ధి కావాలె. నిష్కళంకంగా వుండాలె. అందులో నేవిధమైన మిశ్రమమూ నుండగూడదు—అని.

కాని జాగ్రతావస్థలో నున్నదో లేదో యెట్లా తెలుసుకోవచ్చును? నిష్కారణ కలహాలవల్ల! నిర్బాధాకరమైన కలహాలవల్ల! అందులోనూ మితి ఉంది; ఆనంద ముంది. ఒక్క ఉదాహరణ మిస్తాను. మనము సర్దాగా

స్నానం చేయడానికి చెరువుకు పోతాము. చెరువులో నీళ్లు నిశ్చలంగా ఉంటుందామె. ఇంకా దాన్నిప్రక్కన్నే ఒక నది ప్రవహిస్తూ వున్నది. పైనుండి కెరటాలతో భయంకరంగా గర్జిస్తూ ప్రవాహం వస్తూవుంది. ఈ రెంటిని చూడండి. అప్పుడు నిశ్చయించుకోండి. చెరువులో స్నానం చేస్తామా, నదిలో స్నానం చేస్తామా? ఎందులో స్నానంచేయడాని కానందంగా వుంటుందో— ఉత్సాహంగా ఉంటుందో—

ఇంకొకటి— సర్కసులో పెద్ద పులుల తోనూ సింహాలతోనూ ఆటలాడించే వాళ్లని చూడండి. పడుక్కున్న సింహాలతో ఆడతారా? లేపుతారు. వాటికి పౌరుషం, కోపం పుట్టించేలాగ పొడుస్తారు. అవి నోరు తెరచుకొని వాళ్లమీద దూకవస్తవి. అప్పుడు వాటిచేత అవి చేయవలసిన పనులు చేయిస్తారు.

మరొక్కటి— పాములవాడు పాముల బుట్ట తెరుస్తాడు. అందులో పాము పడుక్కొని వుంటుంది. దాన్ని ఆడించడ మెట్లా? దాన్ని బుఱ్ఱతోనో,చేత్తోనో పొడుస్తాడు.దానికి నొప్పి తగిలి 'భుస్' అంటూ వాడ్ని పొడవ వస్తుంది. అప్పుడు దాన్ని ఆడిస్తాడు.

ఈవుదాహరణాలు చాలు! ఇంక ఆలోచించండి— ప్రేమ సమంగా క్రమంగా సాగిపోతూవుంటే అందులో అందం, చందం, సారస్యం లేదు. ఆనందం లేదు. అది మాటికి మాటికీ 'బుస్ బుస్' అంటూ వుండాలె. ఎదురు తిరుగుతూ వుండాలె. ఉద్రేకం కలుగుతూ వుండాలె. అంతతో నది చల్లారుతూవుండాలె. ఇది నాప్రేమ తత్త్వం! చిత్రం.


కాబట్టి వారంరోజుల కొక్కసారి అయినా నేను కలహం లేకుండా వుండలేను. నాకు తగ్గదే మా ఆవిడ. ముక్కుమీదనే వుంటుంది కోపం! చీదితేనే ముక్కూడిపోతుంది! అంచేత నాకు కలహానికి కారణం సులభంగా దొరికేది.

ఇంక యింతటితో నీఉపోద్ఘాతం చాలించి మొన్న మొన్న జరిగిన ఒకవిషయం చెబుతాను.

దసరా సమీపిస్తూన్నది. రేపు, ఎల్లుండి కూడా సెలవులు. ఇంట్లోనే వుంటాను. కాబట్టి కలహం వుండక తప్పదు. కాని, కారణ ముండవలె గదా! ఆలోచిస్తూన్నాను. ఒక్కదినమంతా ఆలోచించాను. అనేక కారణాలు పొడగట్టినాయి. కాని ఒక్కటైనా నచ్చలేదు. ఎంచేత నంటారేమో! మా యిద్దరి మధ్య కలహం మూడోవారికి తెలియకూడదు. మూడోవారి యెదుట మొహం చిట్లింపులు, మూర్మోహాలు, అలుగులు ఉండగూడదు. ఎంతైనా లోలోపలనే కుళ్ళాలె— బయటికి మొహంమీద ఆనందం, ఉత్సాహం, సంతృప్తి, ఉల్లాసం, సుఖమయచిహ్నా లెన్నో అన్నీ కనబడుతూ వుండాలె. అట్లా లేకపోతే రాద్ధాంతం చేసేవాడ్ని! ఇప్పుడు చాలాకాలానికి, మా పినతల్లికూతురు (అనగా— మా అక్కయ్య), ఆమెమొగుడు,ఆరేండ్లకొడుకూమాయింటికివచ్చి వున్నారు. పండక్కోసమని తీసుకొచ్చాము.

వాళ్ల యెదట మాకు కలహ మెట్లా? కాబట్టి యీమారు కలహం, ముఖ్యంగా మనోమనస్సాక్షిగా వుండి పోవాలె! ఆలోచిస్తూన్నాను. తప్పులు వెదుకుతున్నాను. వెదకేవాళ్లకు తప్పులే కనబడక పోతాయా? ఎంతటి క్షుద్రకారణ మైనా చాలు నను కున్నాను.

ఆనాడు ఎప్పటిలాగా కోర్టుకు వెళ్లుతూ న్నాను. నా కెదురుగా పోస్టుబంట్రోతు వచ్చాడు. నాకు ఉత్తరా లున్నాయా అని అడి




గినాను. అందుమీాదట వాడు ఒక చిన్నపార్సలు (ఇన్సూరు చేసింది) చూపాడు. దానిమీాద మా ఆవిడపైవిలాసం ఉంది. ఆపార్సలు ఆవిడ అన్నగారు పంపారు. అందులో నేమున్నదో నాకు తెలుసును. ఇంట్లో యిమ్మని బంట్రోతుతో చెప్పి నాతోవ నేను పట్టాను. కాని, నాలో నొకవిధమైన వికారం కలగ సాగింది. ఆ పార్సలు నా పేరిటికి రాక నా భార్యపేరిటికి వచ్చింది. అదే నాకు కలిగిన వికారానికి కారణం! అయినా, ఆవిడచుట్టాలు, అన్నదమ్ములు మొదలైనవారు ఆవిడపేరిటికే జాబులు వ్రాస్తూండేవారు సాధారణంగాను. నా పేరిటి కెప్పుడో వకప్పుడు వ్రాసేవారు. జాబులు వ్రాయడమంటేనూ, వచ్చిన జాబులకు జబాబులు వ్రాయడమంటేనూ నాకు మహాచెడ్డ బద్ధకం! అందువల్ల మావాళ్లకుకూడా ఆవిడే జాబులు వ్రాస్తూవుండేది. ఇట్లున్నప్పటికిన్నీ ఆపార్సలు నాపేరిటికి రాలేదే అన్నకోపం—కించిత్కోపం—నాకు కలిగింది! ఈ కోపంతోటి—ఈ ఆందోళనతోటి కోర్టులో నే నేమేమి చేశానో నాకు జ్ఞాపకంలేదు. కాని, తప్పుపను లేమీా చేయలేదు సుమండీ! మామూలు వేళ కింటికి వచ్చాను. వస్తూవస్తూ తోవలో నేను పార్సలుసంగతి ఆవిడను అడగకూడదని మనసులో నిశ్చయంచేసుకొన్నాను. ఇంతమాత్రం నిజం.

ఇంటికొచ్చాను. మామూలుప్రకారంగా కాళ్లూ, చేతులూ, మొహం చన్నీళ్లతో కడుక్కొని, ఫలాహారంచేసి, 'టీ' తాగి, తమలపాకుల 'బీడీ' నములుతూ, 'సిజరుస్' కాలుస్తూ, మొనమొన్న వచ్చిన 'భారతి' చదువుకుంటూ వాలుడుకుర్చీమీాద వాలి వున్నాను. మాబావతో ముచ్చట లాడుతున్నాను. మా

మేనల్లుడు—అనంతం—'భారతి' లోని బొమ్మలు చూపుమని 'మామా—మామా' అని నాచేతిలోని పుస్తకం లాక్కోవడానికి తంటాలుపడుతూన్నాడు. ఈ విసంగా సాయంత్రం గడచింది. రాత్రి యథాప్రకారంగా భోజనాలయినాయి. ఆరాత్రిఅంతా మామూలుగానే గడచిపోయింది. విశేషా లేమీ లేవు. నేను పార్సలు సంగతి ఆవిడను అడగనూ లేదు, ఆపె తనంతట నాతో నేమీ చెప్పనూ లేదు.

తెల్లవారింది. మా ఆవిడ యెప్పుడు నిద్రలేచిందో నాకు తెలీదు. ఆరు గంటలు కొట్టేటప్పటికి నన్ను నిద్రలేపింది. ఇంట్లో సందడిగా వుంది. తలంటుతాను లెమ్మన్నది నన్ను. అట్లాగే నని నేను ప్రాతఃకాలకృత్యాలు తీర్చుకుని తలంటి పోసుకున్నాను. చావడిలో మా బావకూ నాకూ రెండు పీటలు వేశారు. ఇద్దరూ చెరీ వకపీటమీద కూర్చున్నాము.



ముందుగా ఇడ్డెన్లు తెచ్చిపెట్టారు. మేమిద్దరమూ ఫలాహారం చేశాము. అంత మా ఆవిడ నాటకరంగం మీద కథానాయికలాగ సింగారించుకుని సొక్కుతూ సోలుతూ కులుకుతూ వచ్చింది. ఆ వచ్చిరావడం తోటే నాకంట మొట్టమొదట పడ్డది ఆవిడ చెవుల నున్న రవ్వల 'కమ్మలు'. అదే నిన్నటిరోజున టపా బంట్రోతు తెచ్చియిచ్చిన పార్సెల్లో వచ్చింది.

వాళ్ల అన్నయ్య ఆవిడకు 'దసరా కానుక' అని పంపాడు. అది నాకంట బడ్డది. నేనూ—ఆవిడ నిన్నటినుంచి నాతో చెప్పనికారణం చేత—చూచీచూడకుండా ఉండిపోయినాను. నాకప్పులో కాఫీ పోయాలెనని మా ఆవిడ వంగింది. కమ్మలు నాకు చూపాలె నని ఉద్దేశంతో కాబోలు—వేళ్లతో, తన బుగ్గమీద యేమో ఉన్నట్లు, తుడుచుకో పోయింది. ఆతొందరలో, ఆతబ్బిబ్బులో చేతిలోని 'కాఫీ' కూజా జారి నా 'కప్'మీద పడి క్రింద పడిపోయింది. నాకు నవ్వు వచ్చింది. మా ఆవిడకు సిగ్గొచ్చింది. మొహం యెఱ్ఱట్లో అయిపోయింది. తూనీగవలె తుర్రున లోనికి పారిపోయింది. అర్ధగంటసేపు మేము 'కాఫీ' కోసం కనిపెట్టుకోవలసి వచ్చింది. మా బావ "పొరబాటున చేయి జారింది" అన్నాడు. నిజమైన కారణం నాకూ తెలుసు—ఆవిడకూ తెలుసు. కాని, మే మిద్దరమూ—ఇద్దర

మెక్కడ?— నేనుమాత్రమే — మా ఆవిడ లోపలికి పారిపోయిందికదా!—ఏమీ మాట్లాడలేదు. ఎంచేతనోగాని, నా కప్పుడు కోపమే మాత్రమూ రాలేదు. మరొక్కప్పు డీలాజరిగివున్నట్లయితే యెట్లుండేదో. ఇప్పుడుమాత్ర మిది పొరబాటు కాదు, కమ్మలప్రభావ మని నే ననుకున్నాను. నవ్వుకున్నాను. ఊరుకున్నాను!

ఆ తర్వాత నేను పేపరు చదువుటలోను, మిత్రులను చూడడంలోనూ కాలం గడిపినాను. మధ్యాన్నం భోజనాలవేళ. ఈలోపల ఆవిడ నాయెదుటికి నాలుగైదు సార్లు వచ్చింది. కాని, నే నట్టే లక్ష్యపెట్టలేదు. ఆవిడా యేదో పనుల సందట్లో వుండిపోయింది.

పన్నెండు గంటలు కొట్టారు. బావా, నేనూ, మా యిద్దరమధ్య మా అనంతం భోజనానికి పీటలమీద కూర్చున్నాము.


లోకాభిరామాయణంతోటి భోంచేస్తున్నాము. మధ్యమధ్య మా అనంతాన్ని నవ్విస్తూ, వాడి ముద్దుమాటలకు మేము నవ్వుతూ ఉన్నాము. మా ఆవిడ వడ్డన చేస్తున్నది. అక్కయ్య పాలపూరీలు చేస్తూన్నది. మా ఆవిడ సేమియాల పరమాన్నం గిన్నె తీసుకుని మా బావకు వడ్డించింది. అనంతానికి వడ్డించింది. నా కంచందగ్గరికి వచ్చింది. అంతలో నేమయిందో—ఉన్నట్టుండి తల వకమాదిరిగా విసిరింది. ఆ విసురుడువల్ల చేతిలోని గిన్నె జారింది—నా కంచంలో బోర్లాపడ్డది! మా ఆవిడ నా మొహం కేసి చూసింది. నే నావిడ మొహంకేసి చూశాను! బావా, అనంతం అట్టే చూస్తూన్నారు! ఏమి చేయను? ఒక్కవైపున నాకు నవ్వు వస్తూ వున్నది. ఒక్కవైపున కోపం! ఏమి అనడానికైనా తోచింది కాదు! ఎట్లాగైతేనేమి? "ఈవేళ చేతుల్లో నీరసం కలిగిం దెందుకో? ప్రొద్దున 'కాఫీ'కూజా, ఇప్పుడు పరమాన్నం గిన్నె! అన్నీ నేనే తాగాలెనని ఉంటే ఒక్కసారిగా పెద్ద గిన్నె గిన్నే నాముందు పెట్టరాదా? ఈ చిన్నగిన్నె నాకంచంలో బోల్తాపడేయక పోతే? ఈవేళ వాలక మేమీ బాగుండలేదు! కారణ మేమి చెపుమా!" అనిమాత్ర మన్నాను. "మామా, మామోయ్, అత్తయ్యే పరమాన్న మంతా నీకే పోచేచింది. నాకు జీడిపప్పూ, ద్రాచ్చా వేయనేలేదు. నేను జీడిపప్పు యేరుకోనా? అత్తయ్యకి దెయ్యం పట్టింది!" అన్నాడు. ఇందుకు అందరమూ నవ్వాము. ఆవిడ మొహం మాటుచేసుకుని వెళ్లిపోయింది! తర్వాత మా అక్కయ్యే వడ్డన్లు పూర్తిచేసింది. మా ఆవిడ మా యెదటికి రానేలేదు.

ఈపూట భోజనం కొంచెం బరువుగా వుండడంచేతా, రోజుటికన్నా వేళ కొంచెం మీరడంచేతానూ, భుక్తాయాసం తీర్చుకోవలెనని నేను నాగదిలోకీ, మా బావ తనగదిలోకి వెళ్లిపోయినాము. నాకు పగటిపూట నిద్ర అలవాటు లేదు. అయినా కాస్తసే పూరక పడుక్కుందా మనిపించింది. అనంతం పళ్లెంలో తాంబూలపు 'బీడీలు' తెచ్చియిచ్చాడు. తాంబూల

చర్వణంచేస్తూ 'సిజర్సు' వకటి వెలిగించి నా మంచంమీద పడుక్కున్నాను. కొంచెం సే పయ్యేటప్పటికి ఎట్ల పట్టిందో కాని నాకు నిద్ర పట్టింది. సుమారు గంట రెండుగంటలసేపు నిద్ర పోయి వుంటానేమో! కండ్లు తెరచేటప్పటికి మాఆవిడ గదిలో బల్లమీది నిలువుటద్దము వైపుకు తిరిగి కుర్చీలో కూచొని అద్దంలో తన్ను చూచుకుంటూన్నది. జడాగిడాఅంతా తయారైంది. కొర్నాటిచీర—'కిళి' 'కలర్' (చిలుకరంగు) చీర కట్టుకుంది. బెంగుళూరు అంచు పట్టుజరీ రవిక తొడిగింది! ఇంట్లో పెట్టె లో వున్న సొమ్ములు నాలుగూ తగిలించు కుంది. చెవులకు తగిలించుకున్న కొత్తకమ్మలు తీసింది. చూచింది. 'పాలిష్ లెదర్'త్తోటి తుడి చింది. చేతిరుమాలాత్తో చెవులు తుడుచు కుంది. కమ్మల చీల తీసింది. చెవులకు మళ్లీ పెట్టుకుంది. వెనక్కు తిరిగిచూచింది! నేనంత వరకూ అన్నీ చూస్తూనే వున్నాను. వెనక్కి తిరిగి చూచేటప్పటికి కండ్లు మూసుకున్నాను! నేను చూడాలెననుకుందో ఏమో! నేను చూడలేదనుకుంది!

మెల్లగ లేచింది. నన్ను సమీపించింది. భుజం తట్టుతూ "ఈపూట 'టీ' అక్కర్లేదు కాబోలు? నాలుగున్నర వేశారు" అన్నది. నే నులిక్కిపడి లేచాను. ఆవిడను చూచి నవ్వాను. ఆవిడ పైకి ఉపచార మాత్రానికే మందస్మితం చేసింది. "ఏది 'టీ'?" అన్నాను. "తెచ్చియివ్వనా?" అని నేల చూపుత్తో నిలి చింది. నేను "ఊఁ" అన్నాను నవ్వుతూనే.

ఆవిడ వెనక్కు తిరిగి వెళ్లిపోయింది. ఆ నడకలో అప్పుడు ఆశాభంగమూ,అసంతృప్తీ, అసంతుష్టీ నాకు కనబడ్డవి! ఆవిడ వెళ్లిపోయిన తర్వాత "ఇప్పటికైనా యింకా నాతో చెప్ప దు కదా!" అని అనుకున్నాను.



అంతలో ఆవిడ ఒక పళ్లెంలో రెండు మూడు పాలపూరీలు, రెండు ఆమవడలు పట్టుకొనివచ్చి నా ముందు పెట్టింది. నేను "బావ ఫలాహారం చేశాడా?" అన్నాను.

"ఆఁ. చేశారూ. జమ్మి పూజకు,పార్వేటకూ వెళ్లారు."

"ఆఁ? నేను లేనిదే? నన్ను నిద్ర లేపకపోయినావా?"

"నాకు తోచలేదు. ఎప్పుడూ లేని అలవాటు ఈ పూట అవుతుందని నాతో

నెవరూ చెప్పలేదు. అయినా నిద్రలేపుదామని రెండుమూడుసార్లు వచ్చాను; గాని, లేపడానికి మనస్కరించలేదు."

"ఏంచేత?"

"ఏమో—ఏం కోపం వస్తుందో. చాలా పనులతొందరలో ఉన్నారుకదా. నడుంగా నే నడ్డంవచ్చానని—"

"ఎవరు?—నేనా?"

"ఆఁ."

"ఏం తొందరపనిలో ఉన్నాను?"

"కుంభకర్ణుడికి జాబు—"

నాకు నవ్వు వచ్చింది. ఇంతవరకూ ఆవిడ మాట్లాడుతూనే ఉన్నది; కాని, మొహం మీద సహజంగా వుండవలసిన కళాకాంతులు లేవు. ఏమో, చెప్పలేను గాని, యెక్కడనో యేమో లోపం కనబడుతూన్నది.

"కుంభకర్ణుడికి జాబు—" అని యేమో ఆమె అంటూన్నప్పుడు నాకు నవ్వు వచ్చింది. ఆవిడకూ నవ్వు వచ్చింది. నేను మంచమ్మీద నుంచి చివాలున లేచాను. అంతలో మా అనంతం గదిలోకి పరుగున వచ్చి, "మామయ్యా, నన్ను పార్వేటకు తీసకెళ్లవూ? నాన్న నాతో చెప్పకుండా నే వెళ్లిపొయ్యాడు." అని మారాము చేయసాగాడు. నేను వాణ్ణెత్తుకుని, "పోదాంలే. కాస్త 'టీ' తాగి మరీపోదా" మన్నాను. నేనూ వాడూ కలిసి ఫలాహారం పళ్లెం ఖాళీచేసి, 'టీ' తాగి, డ్రెస్సు (ఖద్దరు) వేసుకుని, దేవుడిపార్వేట చూడ వెళ్లిపోయి నాము.


మే మింటికి వచ్చేటప్పటికి దీపాలు వెలిగించారు. అనంతం గిలకలు, 'టమా టమా బండీ' కొనుక్కునివచ్చి వాడితల్లికీ, అత్తకూ చూపుతూ పెద్దగోల చేస్తున్నాడు. మాబావ పూలపొట్లం పట్టుకుని యింటికి వచ్చాడు. కాస్తసేపు మేము పార్వేటసంబరంగూర్చి మాట్లాడుకున్నాము. అంతలో భోజనానికి కబురు వచ్చింది.

ఈపూట వంట పనులు, వడ్డనా మా అక్కయ్యే. మా అవిడ నేయి, మంచినీళ్లు, పెరుగు మొదలైన చిల్లరపదార్థాలు వడ్డించడానికి నేతిగిన్నె పట్టుకుని మాయెదటే నిలిచి వుంది. నే నప్పుడప్పుడు మా ఆవిడవైపు చూస్తున్నాను. ఆప్పు డావిడ చూపులు నేలవైపుకు తిరిగేవి.

నేను ప్రొద్దుటినుంచీ చేస్తున్న 'టక్కరి' తనంవల్ల మా ఆవిడకు కష్టం కలిగివుంటుందా? నేను కమ్మలు చూచీ చూడనట్లు ఉన్నాను! ఆవిడ నాకు చూపనూలేదు. అవి వచ్చినట్లు నాతో చెప్పనూలేదు. నేనై "యి దెక్కడిది? ఎప్పుడు వచ్చింది? బాగుంది." అని అడగాలెనని ఆవిడ ఉద్దేశం! నేనా, "ఈ కమ్మలు చూశారూ? మా అన్నయ్య పంపాడు. నిన్న టపాలో వచ్చింది. బాగుందా?" అని ఆవిడ అడగాలెనని అనుకుంటున్నాను. నే నడగను. ఆవిడ చెప్పదు! కానీ, యెప్పుడు చెప్పతుందో-

అని ఈవిధంగా పరస్పరం ఎవరిమట్టుకు వాళ్ల మట్లుండిపోయినాము. ఇంకా ఆవిడ మనస్సు నొప్పిస్తా మనుకున్నాను. కారణం సరిగ్గామైంది కనబడలేదు. చూస్తున్నాను.

మా అక్కయ్య మా రన్నం వడ్డించ వచ్చింది. మాఆవిడ మజ్జిగ గిన్నె చేతపట్టు కుని నిలబడివుంది. అక్కయ్య అన్నం నా కం చంలో వడ్డిస్తున్నది. అంతలో నేను "అక్క-



య్యా, ఆటీకా మెప్పుడు చేయించారే? క్రొత్త దా? ఎంతయింది? కెంపులు బాగున్నాయి సుమా! చాలా బాగా ప్రకాశిస్తున్నాయి!" అంటూ మాఆవిడ మొహం కేసి కుచ్ఛితంగా వోరచూపుతో చూచాను. మా ఆవిడకు ఈ బాణం చాలా చురుకుగా తగిలిన ట్లయింది కాబోలు! తల వాల్చింది! మా అక్కయ్య నాప్రశ్నకు జబాబుగా "ఔను క్రొత్తదే— మాపూర్లో చేయించాము. ఎనభయిరూపాయ లయింది. రాళ్లు బాగున్నాయి" అన్నది. మా ఆవిడ చురచురచూపులతో నాకేసిచూచింది.

అప్పుడు నేను "ఆఁ! కృతకృత్యు ణ్ణయినాను" అని అనుకున్నాను. కలహ మిప్పుడు పెద్దమా నయిందని నాలో నాకు తెలిసి రాసాగింది. అంతలో మేము భోజనందగ్గరనుంచి లేచి, కాస్త సే పామాటా ఈమాటా చెప్పుకుంటూ ఎవళ్ల గదికి వాళ్లము వెళ్లిపోయినాము.

బల్లమీాద తమలపాకుల 'బీడీ' లేదు. వచ్చి యిస్తుందేమో అనుకున్నాను. పది గంటలుకొట్టినప్పటికిని ఆవిడ రాలేదు. ఒకటిరెండుసార్లు పిలుద్దా మనుకున్నాను. కాని, బెట్టుసరి నన్ను పిలవ నివ్వలేదు. మంచమ్మీాద పరుండి 'సిజర్స్' కాలు స్తున్నాను.

పదకొండున్నర అయిం ది. నాగదితలుపు తెరచుకుని మాఆవిడ లోనికి వచ్చింది. నేను కండ్లు మూసుకుని నిద్ర నటించాను. మంచందగ్గరకు వచ్చింది. నిలిచింది. లేపు దామావద్దా అని ఆలోచించుకుంది కాబోలు! నిలిచి నిలిచి "నిద్రా?" అన్నది.

నేను మారుపలుక లేదు.

"నిజమైన నిద్ర అయితే పలుకుతారు. దొంగ నిద్రకు పలకరు" అన్నది.

ఈచమత్కారానికి నవ్వు రాకుండా ఉం టుందా? చెప్పండి? ఇటు మొహం అయినాను. అంతమాత్రానికే సంతోషమా? నానవ్వు కని పెట్టింది.

"ఈ రోజుల్లో మనుష్యులకు కండ్లుండీ కూడా కనబడకపోవడం ఆశ్చర్యమే!" అన్నది.

ఇది నన్ను గురించిన 'సూటీపోటీ'! ఇదే మొదలు 'అంతఃపురోపన్యా'సానికి.

"పండగపూట తాంబూలం యివ్వడానికి మరచిపోతే ఆశ్చర్యం కాదూ?"అన్నాను నేను.

"పనులసందట్లో వుండిపోయినానేమో—అడిగితే తప్పా?" అని అన్నది. తాంబూలపు 'బీడి' నాచేత బెట్టింది. నములుతూ నేను 'సిజర్సు' వెలిగించాను. పొగ బయటి కూదుతూ, "మనుష్యులకు కనబడకపోయిన కండ్లు గుడ్డికండ్లు! నిజమే. నేను కాదనను. కాని, యీరోజున యేదో ప్రారంభించారే రాణీగారు! పండగపూట సంతోషం, సంబరం పనికిరాదు కాబోలు! కొంచెం ఆవేశం పుట్టినట్లుంది! ఎంచేతనో ప్రొద్దుటినుంచీ ఆలోచిస్తున్నాను. కారణం కనబడలేదు"— అంటున్నాను.

"ఎందుకు కనబడుతుంది? చూడతలచుకోలేనప్పుడు కనబడదు. ఒకళ్ల మెళ్లో చీకట్లో ఎర్రరాళ్లుంటే అవి స్పష్టంగా బాగా కనబడతవి—"

"ఎవరిమెళ్లో? ఎవరికి కనబడతవి?" అని ఆశ్చర్యంతో అన్నాను.

"ఎవరికైనా! ఇష్టంకాని వస్తువు సూర్యకాంతిలాగ మెరస్తున్నా కనబడదు. బాగ్గుచీకట్లోఅయినా కనబడుతుంది."

"ఈపూట యీవిధంగా సాగించావేమీ? నీమాటలకు నాకు అర్థం బోధపడడం లేదు."

"ఆలోచించుకుంటే బోధపడుతుంది.బోధపడీకూడా లేదంటే నాతప్పా? ఎవరి మెళ్లో ఎర్రరాళ్ల 'టీకా'—"

"ఉండుండు-ఎవరి మెళ్లో చెప్మా? ఆఁ-ఆఁ—మా అక్కయ్య మెళ్లో చూచాను—అయితే?దానికేమిప్పుడు? బాగున్నది కాబట్టి అడిగాను—"

"అది కనబడ్డదే, కాని—"

"ఆఁ? ఇంకేమి కనబడాలె? ఇంకాయేమి వేసుకుంది అక్కయ్య? మరేమీ కనబడినట్లు లేదే? కొత్తదింకా యేమి—?"

"కొత్తది కనబడ్డది కాబట్టా? మీకీవేళ యేమీ కొత్తది కనబడనే లేదా? నిజం చెప్పండీ!"

"నిజంగా, నాకు కొత్తగా యేమీ కనబడలేదు. కాని, కాఫీకూజా చేయి జారి పడడం, పరమాన్నపు గిన్నె నా కంచంలో పడడం—ఇవేనా క్రొత్త? అవే అయితే బాగానే కనబడ్డవి." అంటూ నేను నవ్వాను.

"చాల్లేండి పరిహాచకం! ప్రొద్దుటినుంచీ చూస్తున్నాను—మనుష్యులకు కనబడుతుందా లేదా అని! ఊఁహూఁ. అన్యోన్యం ప్రేమిస్తూవున్న భార్యాభర్తల్లో యేమాత్రం నూతనం వున్నా కనబడక మానదు."

"కాబట్టి? నీ వనే దేమిటీ?"

"ఏముందీ? నాకేసి చూస్తారేమో నని ప్రొద్దుటినుంచీ చూస్తున్నాను. కనుక్కుంటారో లేదో అని యెంతో సంతోషంతో కనిపెట్టుకున్నాను. కాని యేమి లాభం? నావంటి మీాద యీనాడు విశేష మేముందో తెలుసుకోలేకపోయారు కాదా?"

"ఏదీ? ఏముందీ!" అని అంటూ నేను మా రాణీగారి చేతులు చూచాను. మెళ్లో చూచాను—

"అక్కడే మున్నాయి? చెవులు చూస్తే తెలుస్తుంది." అని అన్న దామె.

మొహం పైకెత్తి చుబుకం పట్టుకొని



ఆవిడను చూశాను. "అరేరే! ఏమిది? ఈ కమ్మ లెక్కడివి? ఎప్పుడు చేయించావు? ఎంత వెల? ఛా! చాలా బాగుంది సుమీా! పుష్యరాగాలా, వజ్రాలా యివి? పుష్యరాగాల కింత మెర వుంటుందా? వజ్రాలే కాబోలు. ఇది నీ మొహాని కెంతో చక్కదన మిస్తున్నది సుమా! ఆఁ-నాకు చెప్పవేమి! ఎప్పుడు చేయించావు చెప్పవూ?" అని అన్నాను మహదానందంతో.

"ఆఁ-ఇప్పుడు చెబితే కనబడ్డది కాబోలు. ఔను. మీాకు నామీాద యెంత ప్రేమ వుండేది యిందులోనే కనబడుతుంది."

"ప్రేమకూ దీనికీ సంబంధ మేముంది? నీ చెవులకు కమ్మలు తగిలించుకున్న సంగతి నా కేలాగ తెలియాలె? పోనీ! ఈ పూట కొత్తగా వున్నదా? ఎప్పుడైనా చెవులు ఖాళీగా వుందా! కమ్మ లెప్పుడూ నున్న వే."

"కాని, యెప్పుడూ నున్న కమ్మ లేవి? ఇదేనా? అది తెలియవద్దా?

"ఇదో-ఇంకేదో! పోనీ-చెప్పకూడదు?"

"ఏమని చెప్పవలె? నేను కాంగా 'కొత్తరవ్వల కమ్మలు వేసుకున్నాను. చూడండీ! బాగుందా? నే నిప్పు డెట్లా వున్నాను?' అని నే నడగాలనా? కాక 'ఓహో! కొత్తగా వుందే! ఏదీ? ఈ కమ్మ లెక్కడివి? బాగున్నది.' అని యెవరైన అడగాలెనా?"

"ఔను-సుమా! ఏదీ అంతజ్ఞాన మెక్కడిది మగవాళ్లకు? ఇది పాతదేనా, కొత్తదా అని గ్రహించే శక్తి మాకే వున్నట్లయితే—. ఆఁ-ఔను. ఇప్పుడు జ్ఞప్తికి వస్తున్నది నాం

కొకొక్కటిగా! ఇందుకే కాబోలు-నాకు ప్రొద్దున కాఫీ లేక పోయింది! కూజా పగిలిపోయింది! నా కంచంలో పరమాన్నపు గిన్నె బోల్తా పడ్డది. ఆఁ-ఔను. అన్నట్లు మరిచా. నేను మధ్యాహ్నం పడుక్కొని నిద్రపోతూన్నప్పుడు చెవులకమ్మలు చేతికి వచ్చినవి. మరల చక్కదనం చూచుకోవడ మయింది. అక్కడనుంచి, నేను చూచానో లేదో అని నావైపుకు చూచి, నేను చూడక పోవడంచేత నిరాశతో మొహం చిట్లించుకుని మళ్లీ చెవులలో కెక్కించుకున్నావు. ఔను - ఇవన్నీ నాకు తెలిసీ కూడా—"

"అప్పుడు నిద్రపోతున్నారు కదా? మరి—"

"ఔను. నిద్రే పోతున్నాను. పోతూనే చూశాను. అన్నీ నాకు తెలుసు."

"వేషం."

"దొంగవేషం! సొమ్ము తగిలించుకుని మగడు కనుక్కుంటాడో లేదో అని వేషం. కనుక్కో లేదే చూపుదామని కూజా పడేసే వేషం!"

"చాల్లెండి!"

"చాలిస్తా. అన్ని వేషాలూ చెప్పి—"

"పోనిద్దురూ ఇప్పు డెందుకు? నిజంగానే కమ్మలు పొద్దుటినుంచి మీకు కనబడ లేదా?"

"కనబడకపోవడ మెందుకు? కనబడ్డది—కాని, నీవు నాతో చెప్పావా?"

"లేదు—కనుక్కుంటారో లేదో అని."

"కనబడ్డది. అడగ లేదు— నీవు చెబుతావో లేదో అని. సరికిసరి తీరిందీ?"

"వదినగారి మెళ్లో టీకా—"

"అదొక వేషం. నిన్ను ఉడికించాలె నన్న వేషం. నే ననుకున్నట్లే జరిగింది."

"ఏ మనుకున్నారు?"

"కమ్మలసంగతి నాతో చెప్ప లేదు నీవు. కాబట్టి నేను నిన్ను అడగకుండా అక్కయ్యను టీకా సంగతి అడిగితే నీకు కుళ్లు కలుగుతుందని—"

"చాల్లెండి—మరీ—"

"ఉడుకు కలిగిందా లేదా అప్పుడు?"

"ఎవరైనా నవ్వుతారు—"

"ఎందుకు? నిజం చెపితేనా?"

"కాదు. పబ్లీకుగా సూర్యరశ్మిలాగ మెరుస్తున్న ఈరవ్వలకమ్మలవిషయం తెలీయ లేదే? మెళ్లో నాలుగుదండలసందున యెక్కడో నక్కివున్న టీకా యెట్లా కనబడ్డదా అని—"

"ఉలుకు కలిగింది! అంతేకదా! పోనీ—అసలుసంగతి చెప్పు. ఇప్పుడైనా చల్లారిందా? ఈకమ్మలసంగతి నాకు మొన్నటిరోజు నీకు 'పార్సల్' వచ్చిన రోజే తెలుసును. కాబట్టి యిక్కడ యిప్పుడు కొత్త యేమీ లేదు. కాని నీకు ఉడుకుమోతుతనం—"

"ఆమాటనకండి. మన కెప్పుడూ వున్నదే— ఈలాంటికలహం! ఈ వేళ సెలవు కాదూ? ఏనాడమ్మా, మీకు సెలవుల్లో కలహం లేకుండావున్నది?— ఇంక మరచిపోదాం."

---